జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com



# విశేషమైన పొన్నవృక్షాలు



పద్మపత్ర విశాలాక్షి పద్మకేసర వర్ణిని
నిత్యం పద్మాలయా దేవి సామాంపాతు సరస్వతి

సరస్వతీదేవిని అర్చించే పుష్పాల్లో ప్రస్తుతం మనం ఐదవ పుష్పమైన పొన్నపువ్వు గురించిన విషయాల గురించి తెలుసుకుందాం. పురాణాల్లో పొన్నచెట్టు ప్రస్తావన, వర్ణనలను మనం గమనించవచ్చు. దానికి పరిపాటిగానే ఇప్పుడు జరిపిన ఆధునిక అధ్యయనాల్లో సుమారు వందకు పైగా చిన్నా పెద్దా దేవాలయాల్లో పొన్న చెట్లు స్థల వృక్షాలుగా అలరారుతున్నట్లు వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. కొన్ని విశేషమైన పొన్న వృక్షాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## తిరుపుల్లంలోని విశేషమైన పొన్నవృక్షం

**స్థలపురాణం :** ఈ క్షేత్రం శ్రీమద్రామాయణంలోని ఒక ముఖ్య ఘట్టం జరిగిన ప్రదేశంగా గుర్తింపు పొందింది. రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొనిపోయే సమయంలో ఆమెను జటాయువు అనే పక్షిరాజం రక్షించే ప్రయత్నం చేసింది. రావణాసురునితో జరిగిన యుద్ధంలో జటాయువు తన రెండు రెక్కలను కోల్పోయి నేలమీద పడి కొనవూపిరితో వుండగా, కొంత వ్యవధి అనంతరం సీతమ్మ తల్లిని వెదుకుతూ అటుగా వచ్చిన రామలక్ష్మణులకు జటాయువు సీతమ్మ వివరాలు, వారు వెళ్ళిన దిశను తెలిపి తనువు చాలించింది. అనంతరం శ్రీరామచంద్రమూర్తి జటాయువుకు అంత్యక్రియలను నెరవేర్చుటకు పూనుకున్న సమయంలో సీతాదేవి లేని లోటు తలచుకొని బాధపడుతుండగా, అక్కడి దేవాలయంలోని కొలను నుంచి ఒక తామరపువ్వు వికసించి అందులోనుంచి సీతాదేవి భూదేవి రూపంలో ఆవిర్భవించింది. ఆ మీదట వారిరువురూ జటాయువుకు చేయవలసిన అంతిమ సంస్కారాలను పూర్తిచేసి ఆ దివ్యవిహంగ రాజానికి మోక్షాన్ని అనుగ్రహించిన అనంతరం అక్కడ వున్న పొన్నవృక్షం నీడలో సేదతీరారు.

అదే సమయంలో అటుగా వెళ్తున్న ఒక ప్రముఖ వైష్ణవసాధువు తిరుమంగై ఆళ్వారులు చెట్టుకింద వున్న రాముణ్ని చూసి ఎవరో క్షత్రియుడిగా భావించి వెళ్ళిపోబోతూ, ఆ వ్యక్తిలోని దివ్యత్వం, తేజస్సులను గ్రహించి, వెనుదిరిగి చూడగా చతుర్భుజాలతో, శంఖు, చక్ర గదా పద్మాలను ధరించిన శ్రీ మహావిష్ణువు దర్శనమిచ్చాడు.





సాధారణంగా విల్లంబులతో నుంచొని, లేదా సింహాసనంపై కూర్చుని వుండే శ్రీరాముడు, ఇక్కడ మాత్రం శంఖుచక్రాలతో శయనస్థితిలో దర్శనమివ్వడం విశేషం. తమిళభాషలో 'పుల్' అంటే పక్షి. ఆ పేరుమీదే ఈ ప్రదేశానికి 'తిరుపుల్లం' అని పేరు రావడం, పైన తెలిపిన స్థల పురాణానికి అనుగుణంగా వుండటం ఈ పురాణగాథకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

### స్థల విశేషం

పై సంఘటనానంతరం ఈ ప్రదేశం జటాయు మోక్షక్షేత్రంగా పిలువబడుతోంది. ఇక్కడి రాముడు శ్రీ వాల్విల్ రామునిగానూ, అమ్మవారు శ్రీ హేమాంభుజవల్లిగానూ పూజలందుకొంటున్నారు.

శ్రీరామచంద్రుడు వనవాసం కారణంగా తన తండ్రి అయిన శ్రీ దశరథ మహారాజుకు చేయవలసిన అంతిమ సంస్కారాలను నిర్వర్తించలేకపోయిన బాధను, జటాయువుకు చేయడం ద్వారా తీర్చుకోగలిగాడు. అందుచేత ఈ ప్రాంతానికి 'పితృస్థలం' అనే మరో పేరు కూడా సార్థకమైంది. ఎవరైతే ఈ దేవాలయాన్ని దర్శించుకుని ఇక్కడ వారి పితృదేవతలకీ, పూర్వీకులకూ శ్రాద్ధకర్మలు చేస్తారో వారు శాపవిముక్తులై ఉత్తమ లోకాలను పొందుతారని ప్రశస్తి.

**స్థల వృక్షం**

ఈ దేవాలయంలో స్థలవృక్షంగా పున్నాగచెట్టు మనకి దర్శన మిస్తుంది. శ్రీరామ లక్ష్మణులు పాదస్పర్శచేత పునీతమైన ఈ ప్రదేశం సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువుకు నీడనిచ్చి సేదతీర్చిన పొన్న వృక్షాన్ని దర్శించగలిగేవారు పుణ్యాత్ములు.





ఈ దేవాలయంలో తరతరాలుగా సేవలనందిస్తూ వస్తున్న అర్చకులు ఆ దేవాలయంతో పాటు అక్కడి పొన్న వృక్షసంతతిని కాపాడి, తిరిగి నాటుతూ ఈనాటికీ దాన్ని కాపాడు కుంటూ రావడం అనాదినుండి వస్తున్న ఆచార సంప్రదాయాల పట్ల వారికున్న భక్తిశ్రద్ధలకు ప్రత్యక్ష తార్కాణం.

## శ్రీ వేదారణ్యేశ్వరుడు

**స్థల పురాణం**

పొన్నచెట్టు, జమ్మిచెట్టు స్థలవృక్షాలుగా వున్న ఈ దివ్యక్షేత్రం పలు విశిష్టతలు కలిగి వుంది. పురాణగాథ ప్రకారం ఇక్కడ నాలుగు వేదాలు, మానవ రూపాలను దాల్చి పరమశివుని పూజించడం విశేషం. కలియుగ ప్రారంభానంతరం వారు ఈ దేవాలయ ద్వారాలను మూసివేసి ఆ ప్రాంతంలోని వృక్షాలలో వున్న శివుని చైతన్యాన్ని ఆరాధించసాగారు.









ఆ కారణం చేతనే ఈ ప్రాంతానికి 'వేదారణ్యం' అన్న పేరు సార్థకమైంది. కాలాంతరంలో శివభక్తులు శివుని కీర్తనలను గానం చేసి ఆయన్ని మెప్పించి ద్వారాలు తెరుచుకొనేలా చేసారు. ఇక్కడి తీర్థం పేరు 'మణి కర్ణికాతీర్థం'.

**స్థల విశేషం**

* గంగ, యమున, కావేరీ మొదలైన నదుల దేవతలు ఈ తీర్థంలో స్నానం చేసి పునీతులౌతారని ప్రసిద్ధి.
* అగస్త్య మహాముని ఇక్కడ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని దర్శించినట్లు ప్రస్తావించబడింది.
* శ్రీరామచంద్రునికి రావణవధ వల్ల కలిగిన దోషం, ఈ కొలనులో స్నానం ఆచరించి ఇక్కడి ఈశ్వరుణ్ణి పూజించడం వల్ల తొలగి పోయిందని పురాణ ప్రశస్తి.
* ఇక్కడ అమ్మవారి మాట వీణానాదమంతటి మధురంగా ఉండటం వలన ఈమెను 'వీణావాదవిధూషణి' అని సంబోధించటం జరిగింది. ఇక్కడి ఉపదేవాలయాల్లో ఉన్న శ్రీ సరస్వతీదేవి చేతిలో వీణకు బదులు తాటిఆకు కలిగి ధ్యానముద్రలో దర్శనమిస్తారు.
* ఇక్కడి శివుడిని దశరథుడు, రాముడు, పాండవులు, మావలి, మనుమాందట మొదలైనవారు పూజించి దీవెనలను పొందినట్లు పురాణాల్లోని వివిధ సందర్భాల్లో ప్రస్తావించబడింది.



ఇంతటి విశేషమైన పుణ్యక్షేత్రాన్ని, అక్కడి పొన్న వృక్షాన్ని దర్శించి ధన్యతనొందుదాం.

## పున్నై నల్లూర్ మారియమ్మ

**స్థలపురాణం :** ఒక పురాణగాథ ప్రకారం తంజావూర్ సమీపంలో 'తంజ' అనే అసురుడు వుండేవాడు. అతడితో యుద్ధానికి తలపడే ముందు శివుడు తనలోని అష్టశక్తులను ఎనిమిది దిక్కుల్లోని వివిధ ప్రదేశాల్లో నిక్షిప్త పరచడం జరిగింది. వాటిలో తంజావూరుకు తూర్పుదిక్కున వచ్చిన శక్తి అక్కడి పొన్నవనంలోకి చేరుతుంది. ఇదిలా వుండగా 16వ శతాబ్దంలో ఈ శక్తి ప్రకటితమైన వైనం చూద్దాం.

ఒకప్పుడు చోళరాజుల ప్రభావం వల్ల కొందరు మరాఠ రాజులు వివిధ ప్రాంతాల్లో వెలసిన మారియమ్మ దేవతను కొలిచేవారు. ఆ






ప్రకారంగానే వెంకోజి మహారాజా ఛత్రపతి (1676–1688) తిరుచిరాపల్లి సమీపంలో వున్న సమయపురంలోని మారియమ్మ దేవాలయాన్ని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో తంజావూర్ వద్ద బస చేసారు.

ఆ సందర్భంలో పొన్నవనంలో అమ్మవారిగా వెలసిన ఆ దివ్యశక్తి రాజుకు కలలో దర్శనమిచ్చింది. వెనువెంటనే వెంకోజి మహారాజు తంజావూరుకు తూర్పు దిక్కులో వున్న పొన్నవనం చేరి, అక్కడ ఒక పొన్నచెట్టు కింద వున్న చెదల పుట్టను గుర్తించి అక్కడ ఆమెకు ఒక దేవాలయాన్ని నిర్మించాడు. కాలక్రమంలో తుల్జా, షెర్ఫోజీ రాజులు వారి వారి హయాంలో ఆ చెదల పుట్టను అమ్మవారి ఆకారంలోకి మలచి ఆ దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరిచారు.

**స్థల విశేషం :** తుల్జా మహారాజు (1729–35) కుమార్తెకు వ్యాధిసోకి కనుచూపు పోయింది. ఆమె ఇక్కడి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించినంతనే వ్యాధి తగ్గిపోయి కంటిచూపు తిరిగి వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా శ్రీ సదాశివ బ్రహ్మేంద్రయోగి ఇక్కడ శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించి పుట్టమీద అమ్మవారి ముఖాన్ని తీర్చిదిద్దడం జరిగింది. అదే ఈ రోజుకీ పూజలందుకొంటున్న పున్నైనల్లూర్ మారియమ్మ అమ్మవారు. ఇక్కడి అమ్మవారు వివిధ శారీరక పీడలు, వ్యాధుల నుండి భక్తులను కాపాడతారని నమ్మకం. అందుచేత మట్టితో చేసిన వివిధ శరీర భాగాలను ఈ గుడి ప్రాంగణంలో వుంచి, వారికి ఆయా భాగాల్లో వున్న వ్యాధిని నిర్మూలించమని అమ్మవారిని వేడుకోవడం భక్తుల ఆచారం. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా పున్నాగవృక్షాలు విరివిగా వుండటం వల్ల ఈ వూరుకి పున్నైనల్లూర్ అన్న పేరు వచ్చింది. కానీ ఇప్పుడు ఈ దివ్యవృక్షాలు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. ఇక్కడి స్థలవృక్షం వేపచెట్టు.

**పున్నై నల్లూర్ – శ్రీ కోదండ రాముని దేవాలయం :** అదే ఊరులోని శ్రీ కోదండరాముని దేవాలయంలో పొన్నచెట్టు స్థలవృక్షంగా వుంది.






పొన్నచెట్టు ప్రతి ఇంటా తప్పనిసరిగా వుండదగ్గ చెట్లలో ఒకటని శ్రీ మత్స్యమహాపురాణంలో చెప్పబడింది. మరి వీటికి అనువుగా మన ఇళ్ళు వాకిళ్ళు పూర్వం వలెనే విశాలమైన పచ్చని లోగిళ్లతో అలరారే పరిస్థితులు రావాలని కోరుకుంటూ మరిన్ని పొన్నచెట్టు విశేషాలతో మళ్ళీ వచ్చే సంచికలో కలుద్దాం.